క్లుప్తంగా

డిపో ఆకస్మిక తనిఖీ



డిపోలో పరిశీలిస్తున్న ఆర్‌ఎం విజయభాస్కర్

నారాయణఖేడ్: స్థానిక ఆర్టీసీ బస్సు డిపోను శుక్రవారం రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపో ఆవరణ, రికార్డులను పరిశీలించారు. అలాగే డిపోలో బస్సులు, నిత్యం ప్రయాణిస్తున్న ప్రయాణికులు, కలెక్షన్లు తదితర వివరాలను స్థానిక డీఎం మల్లేశయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెకానికల్ ఇంజనీర్ దశరథరావు, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణలతో మాట్లాడి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఖేడ్ నుంచి పుల్కుర్తి, చాల్కి, న్యాల్కల్ మీదుగా ఉన్న రోడ్డుతో పాటు న్యాల్‌కల్ బస్టాండ్‌ను పరిశీలించారు. ఆయన వెంట కనకరాజు, సంగారెడ్డి మెకానికల్ ఇంజనీర్ రాజు, అసిస్టెంట్ మేనేజర్ శివరాం ఉన్నారు.

పరిశుభ్రతను పాటించండి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరూ పాటించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో పలు ఇళ్లను సందర్శించారు. ఈ మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెరిగిన గడ్డి, చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో కలిసి తొలగించారు. ఆయన వెంట మేనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారి తదితరులు పాల్గొన్నారు.

మద్యంబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ఈ మేరకు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 9 మందిని కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.1000, ఒకరికి రూ.1,500, మరో ముగ్గురికి రూ.500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు దుర్గయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ మాణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదన్నారు. దీంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. అలాగే పలు పాఠశాల తరగతి గదులకు కిటికీలు, తలుపులు కూడా లేవన్నారు. అంతేకాకుండా వరండాల్లోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు విశ్వనాథ్ యాదవ్, జగన్నాథం, మోహన్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, కృష్ణ, రాజు, వేణు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల లబ్ధిదారులకు మాజీ ఎంపీపీ రాంరెడ్డి షాదీముబారక్, కల్యాణ లక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాండు, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, తాటిపల్లి మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, తహసీల్దార్ గంగాభవాని, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది శశాంక్, నాయకులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ ఫొటో రిలీజ్



పటాన్‌చెరు టౌన్: ముత్తంగి చర్చి సమీపంలో మంగళవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన రంగారావు మెడలో చైన్ స్నాచింగ్‌కి పాల్పడిన దొంగ ఫొటో చిత్రాలను పోలీసులు శుక్రవారం గుర్తించారు. చోరీ చేసే ముందు ఇస్నాపూర్ సమీపంలో ఏటీఎం లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. ఏటీఎం సీసీ కెమెరాలో నిందితుడు ఫొటో నమోదవ్వగా.. ఆ ఫొటోను రిలీజ్ చేశారు. అయితే ఈ చిత్రం ఆధారంగా ఇంతకు ముందు దొంగతనాలు చేసిన వ్యక్తి కాదని పోలీసులు తెలిపారు. పోలీసులు విడుదల చేసిన ఈ ఫొటోలో ఉన్న వ్యక్తిని ఎవరైనా గుర్తుపడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

రోడ్లు అధ్వాన్నం..

ప్రయాణం నరకం

- విస్తరణకు నోచుకోని రహదారులు
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారడంతో ప్రయాణికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. రహదారులు ధ్వంసమై గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. వివరాల ప్రకారం..జహీరాబాద్ పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. కానీ ఆశించిన మేరకు అభివృద్ధి పనులు జరగడంలేదు. ముఖ్యంగా అంతర్గత రోడ్లు విస్తరణకు నోచుకోవడం లేదు. పట్టణంలో రద్దీ పెరుగుతుండడంతో పాటు ఇరుకుగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయడం లేదు. కొంతమంది రోడ్లను ఆక్రమించుకోవడంతో రాకపోకలు చేసేందుకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



గుంతలు పడి దెబ్బతిన్న బ్లాక్ రోడ్డు

జహీరాబాద్ టౌన్: జిల్లాలోనే జహీరాబాద్ పెద్ద పట్టణం కావడంతో పాటు జాతీయ రహదారిపై నెలకొంది. ఈ పట్టణంలో సుమారు 1.25 లక్షల జనాభా 37 వార్డులు ఉన్నప్పటికీ రోడ్లను మాత్రం అభివృద్ధి చేయడం లేదు. దీంతో పలు వార్డుల్లో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయి. దారులు ఇరుకగా ఉండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. పట్టణంలోని బ్లాక్ రోడ్డు, మానిక్‌ప్రభు, నాగులకట్ట, గడి, ఆర్యనగర్, పాండురంగ వీధి, శ్రీరాం మొహల్లా, కసాబ్ గల్లీ, శాంతినగర్, ఎన్‌జీఓస్ కాలనీ, బ్యాంక్ కాలనీ, బసవనగర్, తహసీల్దార్ కార్యాలయం తదితర అంతర్గత రోడ్లు విస్తరణకు నోచుకోవడంలేదు.

తప్పని ట్రాఫిక్ కష్టాలు

రోడ్లు ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. చిన్న వాహనాలు ఎదురుగా వచ్చినా రోడ్డు దాటేందుకు కష్టతరంగా మారింది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా బైక్‌లు పార్కింగ్ చేయడంతో తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా బ్లాక్ రోడ్డు, హనుమాన్ మందిరం రోడ్డు, భవానీ మందిరం తదితర రోడ్లపై రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొంత మంది వ్యాపారులు రోడ్లపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలను తొలగిస్తే కొంత వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన నిధులు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో జహీరాబాద్ మున్సిపాలిటీకి రూ. 50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో రూ. 9 కోట్లతో రోడ్లు, రూ. 21 కోట్లతో మురుగు కాల్వలతో కలిపి మొత్తం 88 పనులు చేపట్టాలి. కానీ సకాలంలో పనులు చేపట్టకపోవడంతో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రద్దయ్యాయి. ఇటీవల జహీరాబాద్‌కి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే మాణిక్‌రావు నిధులపై ప్రస్తావించారు. రద్దయిన నిధులను విడుదల చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అధ్వాన్నంగా తయారైన అంతర్గత రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పంట నష్టం వివరాల సేకరణ



సంగారెడ్డి: పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



నారాయణఖేడ్: పంట నష్టం వివరాలు సేకరిస్తున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్‌లో దెబ్బతిన్న పంటలను శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారి అభినాష్ వర్మ, ఏఈఓలు పరిశీలించారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లోకి నీరు చేరి పెసర, సోయా, పత్తి తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు నష్టపోయిన పంటలను ఎంఏఓ, ఏఈఓలు రైతులతో కలిసి పరిశీలించారు.

1,250 ఎకరాల్లో పంట నష్టం

నారాయణఖేడ్: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు, వరదలతో డివిజన్‌లో 1,250 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇందులో పెసర, మినుము, కంది, సోయా, పత్తి, వరి పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయని తెలిపారు. వరదలతో వరి చేలల్లో ఇసుక మేటలు వేయగా.. కోతదశలో ఉన్న పెసర, మినుము పంటలు దెబ్బతిన్నాయన్నారు. అలాగే ఇందులో భాగంగానే డివిజన్ పరిధిలో ఏడీ శంకర్, ఏఈఓ బిరాదర్ రాందాస్ ఆధ్వర్యంలో పంట నష్టం వివరాలు సేకరించారు. అలాగే నాగల్‌గిద్ద మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి ఆధ్వర్యంలో పంట నష్టం వివరాలను సేకరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి టౌన్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ లక్ష్మీ తెలిపారు. మండలంలో 33శాతం కంటే తక్కువ పంట నష్టం జరిగినట్లు మండల పరిధి కొత్లాపూర్, ఇర్గిపల్లి, కల్పగూర్ గ్రామాల్లో పర్యటించిన ఆమె వివరాలు నమోదు చేశారు.

స్వచ్ఛతపై సమావేశం

జిన్నారం (పటాన్‌చెరు): పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంఈఓ కుమారస్వామి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ విద్యాలయం అంశాలపై హెచ్‌ఎంలకు దిశా నిర్దేశం చేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

జహీరాబాద్‌టౌన్ (జహీరాబాద్): పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలని శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాణిక్, నాయకులు మహిపాల్, నరసయ్య, కిరణ్, బాలరాజ్, శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

సంగారెడ్డి టౌన్: ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను అధికారులకు తెలియజేయాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు పంచాయతీలలో ఓటరు జాబితాలకు సంబంధించిన సమాచారాన్ని నోటీస్ బోర్డులపై ప్రదర్శించారు. అభ్యంతరాలు ఉంటే కార్యదర్శులకు తెలియజేయాలన్నారు.

గ్రామస్తులకు మొక్కల పంపిణీ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని వావిలాలలో కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులకు, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ మేరకు ఇంటి పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణ కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో హైమాస్ట్ లైట్లను మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు కార్మికులు తొలగించి నూతన లైట్లను అమర్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులున్నారు.

రెండు గ్రామాల రికార్డుల స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం, లక్డారం గ్రామాలను మున్సిపాలిటీలలో విలీనం చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో శుక్రవారం రుద్రారం, లక్డారం గ్రామాల గ్రామపంచాయతీ రికార్డులను ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకటకిషన్ రావు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విలీనమైన గ్రామ పంచాయతీలలో పూర్తిస్థాయిలో మున్సిపల్ పరిపాలన ప్రారంభమవుతుందన్నారు.



రుద్రారంలో సిబ్బందితో కమిషనర్

ప్రతి గ్రామ పంచాయతీలో ఒక వార్డ్ ఆఫీసర్ ప్రజలకు అందుబాటులో ఉంటాడని తెలిపారు.

ఉన్నత పాఠశాలకు విరాళం

మునిపల్లి(అందోల్): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళావేదిక కోసం విజయ ఫౌండేషన్ రూ.25 వేలను విరాళం అందజేసినట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేశ్ కురుమ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మల్లిఖార్జునపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగమేశ్వర్ కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

గణనాథులకు పూజలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో కృష్ణ దేవరాయ నగర కాలనీ ఫేస్–2 లో గణపతి మండపం వద్ద శుక్రవారం మహిళలు కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

130 వినాయక మండపాలు

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో 130 వినాయక మండపాలను ఏర్పాటు చేసినట్లు బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ శుక్రవారం తెలిపారు.

కొనసాగుతున్న పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు పూజలు కొనసాగుతున్నాయి.

గణనాథులకు ఘనంగా పూజలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ జర్నలిస్టు కాలనీలో చిన్నారులు వినాయకుడి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు.

వినాయక నిమజ్జన ఏర్పాటు పరిశీలన..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువు కోనేరు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను శుక్రవారం కార్పొరేటర్ పుష్ప అధికారులతో కలిసి పరిశీలించారు.

ప్రత్యేక పూజలు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో వినాయక మండపాల వద్ద శుక్రవారం జరిగిన పూజల్లో కార్పొరేటర్ సింధు రెడ్డి పాల్గొన్నారు.



పటాన్‌చెరు: కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



టేకూర్‌లో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



రాయసముద్రం చెరువు కోనేరు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప



పూజల్లో కార్పొరేటర్ సింధూ రెడ్డి



గణేష్ నిమజ్జనం ఊరేగింపులో చిన్నారులు



సంగారెడ్డి: సెయింట్ అంథోనీస్‌లో తెలుగు భాషా దినోత్సవంలో ఉపాధ్యాయులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.

మిర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మిర్జాపూర్(బి)లోని జెడ్పీహెచ్ఎస్‌లో గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేశారు.

ప్రతి ఒక్కరూ తెలుగు భాషను గౌరవించాలి

సంగారెడ్డి: గిడుగు వెంకట రామమూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడ దినోత్సవాలను ఒకేసారి ఒకే వేదికపై నిర్వహించడం గొప్ప విషయమని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో తెలుగుభాష, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సాల్మన్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ప్రధానోపాధ్యాయురాలు అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ జయబాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ పాల్గొన్నారు.



న్యాల్‌కల్: మిర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో..

జిన్నారం (పటాన్‌చెరు): పట్టణ కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష సంస్కృతికి గిడుగు వెంకటరామమూర్తి సేవలు ఎంతో గొప్పవని పాఠశాల కరస్పాండెంట్ కరుణసాగర్ రెడ్డి అన్నారు.

వర్షాధార అభివృద్ధి పథకంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: వర్షాధార అభివృద్ధి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు శంకర్, పండరి సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాంద్‌ఖాన్‌పల్లి, పంచగామ, తుర్కపల్లి, ర్యాకల్ గ్రామాలకు చెందిన 110 మంది రైతులతో ఓ క్లస్టర్‌గా ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు కూరగాయలు, తేనెటీగల పెంపకానికి రూ.10 వేల చొప్పున, టమాట బుట్టలు, వానపాముల బెడ్లకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.30 వేల రాయితీ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి విఠల్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు సంజీవరావు, మోహన్, రైతులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: స్థానిక డివిజన్ పరిధిలోని కాలనీల్లో సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గౌతమ్‌నగర్ కాలనీలో రూ.కోటి అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాల్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ్‌నగర్ కాలనీ వాసులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే కాలనీలలో మౌలిక వసతులు కల్పనకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆంజనేయులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రంగు మారిన మిషన్ భగీరథ నీరు



రాయికోడ్(అందోల్): మండల కేంద్రానికి శుక్రవారం సరఫరా అయిన మిషన్ భగీరథ తాగునీరు రంగు మారింది. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లగా స్వచ్ఛంగా ఉండాల్సిన తాగునీరు గోధుమ రంగులో కనపడడంతో షాకయ్యారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో మంజీర నదిలోకి వరద నీరు చేరడంతతో రంగు మారిందని అధికారులు తెలిపారు. కానీ ఈ నీటితో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వాపోతున్నారు. వరద నీటితో రంగు మారిందా లేదా పైపులైన్ లీకేజీలతో రంగు మారుతుందా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. కాగా, రంగు మారిన నీరు రావడంతో ప్రజలు ఫిల్టర్ వాటర్‌ను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

నైపుణ్యంతోనే ఉత్తమ భవిష్యత్

నారాయణఖేడ్: విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని సీఏస్‌ఆర్‌బాక్స్ సంస్థ ప్రతినిధి సాయిప్రసాద్‌స్వామి అన్నారు. ఈ మేరకు సాహితీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సీఎస్‌ఆర్‌బాక్స్ సంస్థ ఐబీఎం స్కిల్స్ బిల్డ్‌తో కలిసి నిర్వహిస్తున్న ఆటమ్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం– 2025 శిక్షణ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ 10 రోజులపాటు ఉచితంగా అందించే ఈ ప్రోగ్రాంలో ఏఐ ఫ్రమ్ కురియస్ టు క్రియేటర్, క్రాక్ యువర్ కేరీర్, ఐఏ పవర్డ్ ప్లేస్‌మెంట్ అసిస్టెంట్ లెర్నింగ్ పాథ్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణతో విద్యార్థులు ప్రాజెక్టులో పాల్గొని ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశం పొందడంతో పాటు కేరీర్‌కు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అనంతరం ధృవపత్రాలతో పాటు డిజిటల్ బ్యాడ్జిలు అందజేస్తామన్నారు.



అవగాహన కల్పిస్తున్న సాయిప్రసాద్‌స్వామి

జాతీయస్థాయి పోటీలకు పటాన్‌చెరువాసి ఎంపిక



నీలకంఠను అభినందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పట్టణానికి చెందిన విద్యార్థి మంగలి నీలకంఠ క్యారమ్స్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని హబ్సిగూడ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ ఆధ్వర్యంలో ఐసీఎస్ఈ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 2025 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా క్యారమ్స్ అండర్–17 విభాగంలో నీలకంఠ ప్రథమ స్థానం సాధించారని కోచ్ రమేష్ తెలిపారు.త్వరలో పశ్చిమ బెంగాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో నీలకంఠ తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నీలకంఠతో పాటు అతని తండ్రి మంగలి వినోద్, కోచ్ రమేష్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్, హరి, తదితరులు పాల్గొన్నారు.